క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

తల్లాడ ఎస్సైగా కొండల్‌రావు..


కొండల్‌రావు

తల్లాడ: తల్లాడ ఎస్‌ఐగా కొండల్‌రావు నియమితులయ్యారు. తల్లాడ ఎస్సై సురేష్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో నూతన ఎస్సైగా కొండల్‌రావు రానున్నారు. ప్రస్తుతం రఘునాధపాలెం ఎస్సైగా పనిచేస్తున్న కొండల్‌రావు గతంలో కల్లూరు స్టేషన్‌లో పనిచేశారు. ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

కల్లూరు ఎస్‌ఐగా సాకీర్..


సాకీర్

కల్లూరు: కల్లూరు ఎస్సైగా ఎస్‌కే సాకీర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. కల్లూరులో చేస్తున్న ఎస్సై పూదరి రఘు బదిలీపై ఖమ్మం వెళ్లగా.. ఖమ్మం రూరల్ నుంచి బదిలీపై సాకీర్ వచ్చారు.

సిమెంట్ బల్లలు వితరణ


సిమెంట్ బల్లలను అందిస్తున్న దాతలు

కారేపల్లి: కారేపల్లిలోని సుబ్బయ్యకుంట చెరువు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీగంగమ్మతల్లి దేవాలయం ప్రాగణంలో సిమెంట్ బల్లలను ఆదివారం వితరణగా అందించారు. కారేపల్లికి చెందిన కందుకూరి గురప్ప జ్ఞాపకార్థం ఆయన కుమారులు నరేష్, రమేష్‌లు భక్తుల సౌకర్యార్థం సిమెంట్ బల్లాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, సంతగుడి మాజీ చైర్మన్ మల్లేల నాగేశ్వరరావు, మత్స్యకారుల సంఘం నాయకులు తురక రవి, వాసుదేవాచారి పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న లంకా కొండయ్య

మధిరరూరల్: మధిర పట్టణంలోని ఆజాద్ రోడ్డులో ఉన్న మహాత్మాగాంధీ ఉచిత పాత దుస్తుల సేకరణ కేంద్రం ద్వారా నిరుపేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. కేంద్రం నిర్వాహకులు, సామాజిక సేవకులు లంకా కొండయ్య ఆధ్వర్యంలో పలువురు దాతల నుంచి పాత దుస్తులను సేకరించారు. యరమల సంజీవరెడ్డి, వంకాయలపాటి నాగేశ్వరరావు, తిరుమలశెట్టి వెంకటరమణ, మేడేపల్లి శ్రీనివాసరావు, మర్సకట్ల స్వర్ణాకర్, చిన్నం నరసింహారావు తదితరుల నుంచి సేకరించిన దుస్తులను ఒరిస్సా నుంచి మిర్చి కోతకు వచ్చిన కూలీలకు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లంకా సేవా ఫౌండేషన్ వాలంటీర్లు శ్యామ్, గోపి, సాయి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

పేద వృద్ధులకు చీరలు పంపిణీ..


చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో పేద వృద్ధులకు ఉపాధ్యాయుడు కోలకాసురి బాలస్వామి, సభిత దంపతులు రూ.10వేల ఆర్థిక సాయంతో చీరలు పంపిణీ చేశారు. వీటిని ఎన్సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్, లక్ష్మీ దంపతుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ప్రభాకర్, అనీల్‌కుమార్, తడికమళ్ల ప్రకాశరావు, నల్లగట్ల భాస్కర్‌రావు, నూతక్కి నవకుమార్, నాగేశ్వరరావు, కుమార్, వెంకటేశ్వరరావు, సామేలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


స్నేహితురాలికి రూ.50వేలు అందజేస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం ప్రభుత్వ పాఠశాలలో చదివిని 1986–87 పదో తరగతి విద్యార్థులు అప్పటి స్నేహితురాలు పిల్లి సలోమి కేన్సర్‌తో బాధపడుతుండడంతో ఆదివారం రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. ఆమె ప్రస్తుతం లంకపల్లిలో నివసిస్తుంది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొండపల్లి కొండల్‌రావు, కె.లక్ష్మణ్‌సింగ్, పున్నం రామమూర్తి, డి.రామాకృష్ణ, సోయం నాగేశ్వరరావు, తన్నీరు శ్రీనివాసరావు, సోయం వెంకటేశ్వరరావు, జంగాల నాగభూషణం, డి.వి.ఎస్.ఎస్.రెడ్డి, అరీఫ్ పాల్గొన్నారు.

టాటూ ట్రెండింగ్..

శరీర భాగాలపై రంగుల వల్లులు

- క్యూ కడుతున్న యువత
- మారుతున్న కాలానికి అనుగుణంగా అడుగులు
- ప్రత్యేకత కోసం ధరలను లెక్కచేయని వైనం

ప్రస్తుత కాలంలో టాటూ.. ట్రెండ్‌గా మారింది. నాటి పచ్చబొట్టే.. నేడు టాటూ.. పేరేదైనా జీవితకాలం ఉండే జ్ఞాపకం. సెలబ్రిటీల దగ్గర నుంచి సామాన్యుల వరకు డిఫరెంట్‌గా కనిపించాలని శరీరంపై టాటూ డిజైన్ వేయించుకుంటున్నారు. తమకు నచ్చిన వారి పేర్లతో పాటు ఫొటోలను టాటూగా వేయించుకుంటున్నారు. కొందరు స్టైల్ కోసం మరికొందరు ప్రేమను వ్యక్తపరిచేందుకు ఆసక్తి చూపుతున్నారు.


టాటూ వేయించుకుంటున్న యువతి

వైరారూరల్: ప్రస్తుతం మార్కెట్లో వివిధ రకాల డిజైన్లు అందుబాటులోకి వచ్చాయి. అందులో ట్రైబల్ టాటూ ఇది ఒక చేయి లేదా వ్యక్తి కోరిన శరీర భాగం మొత్తం మీద ఈ టాటూను వేస్తారు. అలాగే ఫీథర్, ఫింగర్ ప్రింట్, ఫేస్, ఫ్లవర్, కాంఫస్, స్నేక్, కమ్యూనిటీ నేమ్స్, నచ్చిన హీరో, హీరోయిన్స్, పెంచుకునే శునకాలు తదితర రకాల చిహ్నాలను యువతి, యువకులు తమ శరీర భాగాలపై టాటూలుగా వేపించుకోని మురిసి పోతుంటారు.

టాటూ విధివిధినాలు ఇలా..

ఒకప్పుడు టాటూలు లేనందున పచ్చబొట్టు కళాకారులు తమ సొంత నైపుణ్యంతో వ్యక్తుల శరీర భాగాలపై తమకు కావాల్సిన పలు రకాల చిహ్నాలను పచ్చ ఇంకుతో గుచ్చుతూ వేసేవారు. ప్రస్తుతం పచ్చబొట్టు కనుమరుగై టాటూలు అందుబాటులోకి వచ్చాయి. టాటూలు వేయించుకునే యువతి, యువకుల అభిరుచులను బట్టి టాటూ వేయడం జరుగుతుంది.

ధరను లెక్క చేయకుండా..

ఇతరుల ముందు తమ అభిరుచులు, ప్రత్యేకతను చాటాలని యువతి, యువకులు తాపత్ర్య పడుతున్నారు. దీనికోసం ధర ఎంతైనా తమకు నచ్చిన శరీరభాగాలపై టాటూ వేయించుకుంటారు. గతంలో పచ్చబొట్టు వేసే కళాకారులు పచ్చబొట్టు వేసేందుకు రూ.200 వరకు తీసుకునేవారు. కానీ ప్రస్తుతం ఆర్టిస్టులు టాటూలు వేసేందుకు ఇంచుకు రూ.500 నుంచి రూ.2 వేల వరకు అర్జిస్తున్నారు. అంటే తమకు టాటూ వేయించుకోవాలంటే ఇంచును బట్టి రూ.5 వేల పైగా చెల్లించాల్సి ఉంటుంది.






చేతులపై టాటూలు వేయించుకున్న దృశ్యం

వెలిసిన సెంటర్లు..

గతంలో నగరానికే పరిమితమైన టాటూ కల్చర్ ప్రస్తుతం చిన్న పట్టణాలకు సైతం విస్తరించింది. అప్పట్లో జాతర్లో ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే పచ్చబొట్టు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం టాటూలు వేసేందుకు అనేక సెంటర్లు వెలిశాయి. దీంతో వివిధ పరికరాలతో ఆర్టిస్టులు టాటూలు వేసి ఆదాయాన్ని అర్జిస్తున్నారు.

పలువురిని ఆదర్శంగా..



ప్రస్తుత యుగంలో ప్రతి ఒక్కరికి టాటూ వేసుకోవడం అనేది ఒక అలవాటుగా మారింది. సెలబ్రిటీలు టాటూలు వేసుకోని మా లాంటి యువకులను ఆకర్షింప చేస్తున్నారు. మేము వారిని ఆదర్శకంగా తీసుకోని మా ప్రత్యేకతను చాటుకునేందుకు టాటూలు వేయించుకోని ఆనందపడుతున్నాం.

– మోదుగు చందు, రెడ్డిగూడెం

టాటూలతో హల్‌చల్..



గతంలో తమ నచ్చిన చిహ్నాలను పచ్చబొట్టులుగా వేసుకోని పలువురు ఆనంద పడేవారు. కాల క్రమేనా పచ్చబొట్టు కనుమరుగై టాటూలు అందుబాటులో వచ్చిన నేపథ్యాన యువతి, యువకులు తమ నచ్చిన చిహ్నాలను చేతులు, కాళ్లు, ఇతర శరీర భాగాలపై టాటూలుగా వేయించుకుంటున్నాం.

– కొమ్మినేని మహిత, వైరా

క్రేజ్ పెరిగింది..



నలుగురిలో ప్రత్యేకంగా కనిపించడం కోసం నేటి యువత టాటూలు వేసుకుంటున్నారు. ప్రస్తుతం నేటి యువత టాటూలపై క్రేజ్ పెరిగింది. ప్రతి రోజే ఒక్కరైనా టాటూ వేయించుకునేందుకు మా షాపుకు వస్తున్నారంటే యువతి, యువకులు టాటూలను ఎంత ఆదరిస్తున్నారో తెలుస్తుంది.

– పిల్లుట్ల భార్గవ్, టాటూ ఆర్టిస్ట్, వైరా

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అలనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

వైరా: వైరాలోని ప్రగతి పాఠశాలలో 1994–95 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆదివారం ఖమ్మంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకోని ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల చైర్మన్ యల్లంపల్లి వెంకటరామనర్సయ్య, ఉపధ్యాయులు జాలాది భద్రయ్య, దామా అజిత, వెంకటేశ్వర్లులను ఘనంగా సత్కరించారు. ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు జొన్నలగడ్డ మన్మధరావు, బొంతు మాధవరావు, రామకృష్ణ, సునీత్, నాగబాబు, రాయల సురేష్, బషీర్, సీత, మాధురి, జ్యోతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.


తిమ్మినేనిపాలెం పాఠశాలలో..

చింతకాని: మండలంలోని తిమ్మినేనిపాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 2005–06 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో వేర్వేరు రంగాల్లో స్థిరపడిన వారందరూ 18 ఏళ్ల తర్వాత ఒక చోట కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి నాయుడు, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు శ్రీరామ్, కిరణ్మయి, నాగేంద్రయ్య, మణికుమార్, రాజ్యలక్ష్మి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

మధిర: అకాల వర్షాలతో నష్టపోయిన మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధిర పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుబాబుల్ రైతులకు అన్ని కంపెనీలు టన్నుకు రూ.500 ధర తగ్గించినప్పటికీ జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి ఒక్కరు కూడా స్పందించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితబంధు విషయంలో స్పష్టమైన ప్రకటన ఇప్పటివరకు ఇవ్వలేదని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ ఇళ్లను తొలగించి నూతన ఇళ్లు నిర్మించి అర్హులకు అందించాలన్నారు. మధిర పట్టణంలో రైల్వే అండర్ పాస్ నిర్మాణం చేపడుతూ చిరు వ్యాపారులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షులు పాపట్ల రమేష్, పగడాల నాగేంద్రబాబు, గరిడేపల్లి వేణు, రామకృష్ణ, కనకాచారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏలూరి నాగేశ్వరరావు

4న బీఆర్‌ఎస్ సభ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

వైరా: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలుపుకోసం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం ఫిబ్రవరి 4న వైరాలో నిర్వహించే నియోజకవర్గస్థాయి పార్లమెంటరీ సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ మదన్‌లాల్ పిలుపునిచ్చారు. వైరాలోని మిట్టపల్లి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంటరీ సభకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, పార్థసారధి రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ హాజరు కానున్న నేపథ్యాన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు మద్దెల రవి, బాణాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే 'చెకుముకి'

తల్లాడ: పాఠశాల స్థాయిలో విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగిందని జేవీవీ మండల కోఆర్డినేటర్ మాదినేని నరసింహారావు, ఎంఈఓ ఎస్.దామోదర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం తల్లాడ మండలకేంద్రంలోని పాఠశాలలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఇంగ్లీష్ మీడియం విభాగంలో జెడ్పీహెచ్ఎస్ కుర్నవల్లి ప్రథమ, ప్రభుత్వ తెలుగు మీడియం విభాగంలో జెడ్పీహెచ్ఎస్ అన్నారుగూడెం పాఠశాలలు ప్రథమ స్థానంలో నిలిచాయి. ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం విభాగంలో బాలభారతి విద్యాలయం విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను తల్లాడ హైస్కూల్ హెచ్ఎం ప్రసూన, జి.ఎస్.మురళీకృష్ణ అభినందించారు.

బోనకల్: మండలంలోని రావినూతలలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన చెకుముకి పోటీల్లో బ్రాహ్మణపలి జెడ్పీ పాఠశాల విద్యార్థులు గుడిద అఖిల, గుడిద ఉమశ్రీ, పెద్దప్రోలు వెంకటస్వాతి ప్రథమ స్థానం సాధించిట్లు హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పోటీల్లో గెలుపొందిన విజేతలను పీఎస్ హెచ్ఎం గుగులోత్ రామకృష్ణ, ఉపాధ్యాయులు అన్నపూర్ణాదేవి, యస్ రామకృష్ణ , పి.పుల్లారావు, శారద, రంజాన్ అలీ, రవికుమార్, ససీమా సుల్తానా అభినందించారు.


బోనకల్: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

29 నుంచి రేమిడిచర్ల రైల్వే గేట్లు మూసివేత

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల గ్రామ సమీపంలోని రెండు రైల్వే గేట్లను మరమ్మతుల కారణంగా ఈ నెల 29 నుంచి 31వరకు మూడు రోజుల పాటు మూసివేయనున్నట్లు మండల తహసీల్దార్ ఉషాశారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తమకు రైల్వే అధికారులు నివేదించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించాలని, రైల్వే అధికారులకు సహకరించాలని కోరారు.

31న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఎర్రుపాలెం: ఈ నెల 31వ తేదిన మండలపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖల అధికారులు విధిగా తమ తమ శాఖల ప్రగతి నివేదికలను కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సర్వసభ్య సమావేశానికి మండలస్థాయి అధికారులే విధిగా హాజరుకావాలని కోరారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్లు సకాలంలో సమావేశానికి హాజరు కావాలన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

కల్లూరురూరల్: మండలంలోని హనుమతాండ సర్పంచ్ మోహన్ నాయక్‌కు ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న క్రమంలో ఆదివారం ఎమ్మెల్యే మట్టా రాగమయి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన సంక్షేమ కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, సైదానాయక్, రవికుమార్‌నాయక్ , బానోత్ కుమార్, ఉపసర్పంచ్ సూరానాయక్‌తో పాటు పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

సృజనోత్సవ్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

కొణిజర్ల: ఖమ్మం ప్రియదర్శిని విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సృజనోత్సవంలో కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన మహిళ డిగ్రీ కళాశాల బాలికలు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి బహుమతులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.మానస తెలిపారు. కళాశాలకు చెందిన సెకండ్ ఎంపీసీఎస్ విద్యార్థిని బిందు వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించింది. క్విజ్ జానపద నృత్యం విభాగాలలో కళాశాల విద్యార్థినులు ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినీలను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ముస్లింల ఐక్య సంఘ సమావేశం


సమావేశంలో పాల్గొన్న ముస్లిం సోదరులు

మధిర: మధిర పట్టణంలోని షాదీఖానాలో ఆదివారం ముస్లింల ఐక్య సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మధిర నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ముస్లింల ఐక్య సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు మౌలానా షేక్ ముజాహిద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గెలుపు కోసం కృషిచేసిన ముస్లిం సోదరులకు ధన్యవాదాలు తెలిపారు. దేశంలో మతం పేరుతో రాజకీయం చేస్తున్న బీజేపీని రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. అన్ని కులాలను, మతాలను సమానంగా చూస్తూ ప్రజాపాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం షాదీ ముబారక్‌లో భాగంగా లక్ష రూపాయలతో పాటు తులం బంగారం కూడా అందజేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దారా బాలరాజు, షేక్ జహంగీర్, నిడమానూరు వంశీకృష్ణ, షేక్ జాకీర్, గౌసుద్దీన్, పాషా, కరీం, గాలిబ్, బాసిత్ అలీ, బాజీ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు

చింతకాని: ఖమ్మం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం జరిగిన యూటీఎఫ్ మండల మహాసభలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తోటకూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఉదారపు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు మందడపు రామనర్సింహారావు, మన్నేపల్లి విజయలక్ష్మి, కోశాధికారి కారుమంచి జయకర్, ఆడిటర్ తలగాని వెంకటేశ్వరరావు, కార్యదర్శులు భాగ్య, సుధాకర్‌రావు, రమణ, నర్సింహారావు, వాసు, విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘం బలోపేతానికి పాటుపడతానని తెలిపారు. మండల అధ్యక్షుడిగా తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా బాధ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

బెటాలియన్‌లో ఉచిత వైద్య శిబిరం

సత్తుపల్లిరూరల్: గంగారం 15వ ప్రత్యేక బెటాలియన్‌లో ఆదివారం ఉచిత మెగా దంత, కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. వీటిని కమాండెంట్ వెంకటరాములు ప్రారంభించారు. బెటాలియన్ అధికారులు సిబ్బంది కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ వెంకటరాములు మాట్లాడుతూ.. మనిషి అవయవాలలో అన్నిటికన్నా కళ్లు, దంతాలు జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ దళాధిపతి ఎస్.వెంకన్న, వైద్యులు డి.శ్రీనివాస్, జూపల్లి వెంగళరావు, పెద్దిరాజు, లయన్స్‌క్లబ్ చైర్మన్ మందపాటి ప్రభాకర్‌రెడ్డి, చలపతిరావు, డి.కృష్ణయ్య, రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


దంత పరీక్షలు చేయించుకుంటున్న బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు

పరామర్శ..


బిల్లుపాడులో కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తల్లాడ: ఇటీవల అనారోగ్యానికి గురైన బిల్లుపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జక్కంపూడి కృష్ణమూర్తిని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. బిల్లుపాడులో జక్కంపూడి గృహంలో విశ్రాతి తీసుకుంటున్న ఆయన్ని పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దుండేటి వీరారెడ్డి, సామినేని రామప్పారావు, గ్రామ నాయుకులు పాల్గొన్నారు.

నరసయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే..


పరామర్శిస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

తల్లాడ: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ఇటీవల మరణించిన తోట నరసయ్య కుటుంబ సభ్యులను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా నరసయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంకట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువభారత్ శక్తికి సేవారత్న పురస్కారం

సత్తుపల్లి: సత్తుపల్లి యువభారత్ శక్తి ఫౌండేషన్ అందిస్తున్న సేవలకు గాను విశాఖపట్నం చెందిన తాసు బెల్లి ఫౌండేషన్ ఆదివారం భారతసేవారత్న పురస్కారాన్ని ప్రధానం చేసింది. ఫౌండేషన్ చైర్మన్ శంకర్ యువభారత్‌శక్తికి ఫౌండర్ కె.క్రాంతి, సభ్యులకు అందించారు.


పురస్కారం అందుకుంటున్న క్రాంతి, సభ్యులు

మరమ్మతులు మరిచారా..!

వైరారూరల్: మండలంలోని ముసలిమడుగు–కొత్త ముసలిమడుగు గ్రామాల మధ్య గత ఏడాది కిందట నిర్మించిన బీటీ రోడ్డు ఇటీవల వర్షాలకు ధ్వంసమైనా.. సంబంధిత శాఖ అధికారులు రోడ్డు మరమ్మతులు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. గత ఏడాది క్రితం తాటిపూడి–ముసలిమడుగు వయా కొండకొడిమ గ్రామాల మధ్యలోని లింకు రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు 2 బిట్లుగా రెన్యూవల్ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ముసలిమడుగు నుంచి కొత్తముసలిమడుగులోని గిరిజన సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాల/కళాశాల వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర రూ. 2.30 కోట్ల నిధులు మంజూరు చేసిన నేపథ్యాన అధికారులు శరవేగంగా బీటీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేశారు. కాగా గత భారీ వర్షాలకు వైరా రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండి వైరా నది పరవళ్లు తొక్కిన నేపథ్యాన వైరా నదికి అనుసంధానంగా ఉన్న ముసలిమడుగు–కొత్తముసలిమడుగు గ్రామాల మధ్యలోని బీటీ రోడ్డు సుమారు 100 మీటర్ల మేర ధ్వంసమై కంకర తేలడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కావున సంబంధిత శాఖ అధికారులు స్పందించి ధ్వంసమైన బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


ధ్వంసమైన బీటీ రోడ్డు